క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రఘునాథపాలెం: రఘునాథపాలెం సబ్ స్టేషన్ మరమ్మతులు, కొత్తలింగాల 33 కేవీ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ఎ.ఇందిర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రఘునాథపాలెం, కేసీఆర్, కేటీఆర్ కాలనీలు, కోయచలక, రేగులచలక, ప్రగతిఫ్రైడ్, రఘునాథపాలెం పైకాలనీ, దారేడు, శివాయిగూడెం, పువ్వాడఉదయ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఉత్తమ జీపీగా తిరుమలాయపాలెం



సర్పంచ్, కార్యదర్శిని సన్మానిస్తున్న కలెక్టర్

తిరుమలాయపాలెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షన్, శానిటేషన్, కంపోస్టింగ్, ఘన వ్యర్థాలు, పారిశుద్ధ్యం లక్ష్యాలు సాధించినందుకు జిల్లాలో తిరుమలాయపాలెం గ్రామాన్ని ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక చేశారు. ఈ మేరకు కలెక్టర్ వీ.పీ. గౌతమ్ బుధవారం గ్రామ సర్పంచ్ కొండబాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి సునీతలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, మండల ఎంపీడీఓ చుంచు శ్రీనివాసరావు, ఎంపీఓ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బెదిరించి నగదు, ఫోన్ చోరీ

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లలో ఓ వ్యక్తిని బెదిరించి నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నట్లు తెలిసింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రెండు రోజుల క్రితం రాత్రివేళ ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి వస్తుండగా వైఎస్సార్ కాలనీ, చెరువుకొమ్ముతండా సమీపాన గుర్తుతెలియని వ్యక్తులు ఆపారు. అనంతరం ఆయనను బెదిరించి నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు

నేలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని కోరుతూ.. ఎమ్మార్పీఎస్ చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. మూడో రోజు దీక్షలను మాదాసి వెంకన్న ప్రారంభించి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుంటే వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలకు ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పొట్టపింజర బాలస్వామి, తోళ్ల వెంకన్న, వడ్లమూడి ప్రసాద్, రాయబారపు గురవయ్య, తోళ్ల వీరబాబు, పొట్టపింజర రవికిరణ్, వినయ్, బూరుగడ్డ శ్రీను, సిద్ధెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ టోర్నీలో హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఖమ్మం స్పోర్ట్స్: నిర్మల్‌లో ఇటీవల జరిగిన 6వ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఖమ్మం హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. బాలికల విభాగంలో ఆర్.లాస్య, బాలుర విభాగంలో కె.లోకేష్, ఆర్.దివాకర్ రాణించగా, కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి గురువారం అభినందించారు.

సీపీఐ నాయకుల ముందస్తు అరెస్ట్

కూసుమంచి: రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యాన మండలానికి చెందిన పలువురు సీపీఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పార్టీ మండల కార్యదర్శి భూక్యా నర్సింహనాయక్, నాయకులు జిల్లా లింగయ్య, లాలూ, శంకర్, ప్రసాద్, హుస్సేన్ అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. వీరితో పాటు పీడీఎస్‌యూ నాయకులు గోపి, రామకృష్ణ, వెంకన్న, వీరబాబు, వంశీలను కూడా అరెస్ట్ చేశారు. అక్రమ అరెస్టులను ఆయా సంఘాల బాధ్యులు ఖండించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మార్క్ ఆంటోని
వినోద	జవాన్(హిందీ), జైలర్
సాయిరాం	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
ఆదిత్య	చాంగురే బంగారు రాజా
శ్రీనివాస	జవాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఏడాదిలోగా నర్సింగ్ కళాశాలలు



నర్సింగ్ కళాశాల భవన నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన మంత్రి అజయ్, ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి, ఎంపీ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు మధు, రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ గౌతమ్

- ఎమ్మెల్యే పట్టుబట్టి మంజూరు చేయించారు..
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- మద్దులపల్లిలో భవన నిర్మాణాలకు శంకుస్థాపన

ఖమ్మంరూరల్: వచ్చే ఏడాదిలోగానే ప్రభుత్వ నర్సింగ్ కళాశాల కోసం శాశ్వత భవన నిర్మాణాలు పూర్తిచేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వెల్లడించారు. మండలంలోని మద్దులపల్లిలో రూ.25 కోట్లతో ఐదెకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న నర్సింగ్ కళాశాల భవన నిర్మాణాలకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ గతంలో కేరళ నుండి వచ్చి ఇక్కడ ఆస్పత్రుల్లో నర్సులు పనిచేసే వారని తెలిపారు. కానీ ఇప్పుడు సీఎం కేసీఆర్ హయాంలో ప్రతీ జిల్లాలో వైద్యకళాశాలతో పాటు నర్సింగ్ కళాశాల ఏర్పాటుచేస్తుండడంతో ఆ ఇక్కట్లు తీరుతున్నాయని చెప్పారు. కాగా, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పట్టుబట్టి పాలేరుకు నర్సింగ్ కళాశాల మంజూరు చేయించుకున్నారని తెలిపారు. అలాగే, నియోజకవర్గ అభివృద్ధికి రూ.125కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయించుకున్న ఘనత కూడా ఆయనదేనని చెప్పారు. త్వరలోనే ఖమ్మం జిల్లాకు బీఎస్సీ పారామెడికల్ కళాశాల మంజూరు చేస్తామని, జిల్లా ఆస్పత్రికి ఎంఆర్‌ఐ స్కానర్ కేటాయించనున్నట్లు హరీశ్‌రావు వెల్లడించారు. ఇక ఆరు నెలల్లో సీతారామ ప్రాజెక్ట్ పూర్తవుతుందని.. ఆ వెంటనే సాగర్‌తో పనిలేకుండా రెండు పంటలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఇప్పటికే భక్తరామదాసు ప్రాజెక్ట్‌తో పాలేరు ప్రజలకు సాగు, తాగునీటి కష్టాలు తీరాయన్నారు. కాగా, కాంగ్రెస్ నేతలు మేకపోతు గాంభీర్యంతో ఖమ్మంలో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు రానివ్వమంటున్నారని... ఇదేమైనా వారి జాగీరా అని ప్రశ్నించారు. ఏదిఏమైనా వచ్చేసారి కూడా బీఆర్‌ఎస్ అధికారంలోకి రాబోతుందని.. ఇందుకోసం కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని హరీశ్‌రావు కోరారు.

అందుబాటులోకి వైద్యవిద్య

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ మాట్లాడుతూ జిల్లాకు మెడికల్, నర్సింగ్ కళాశాలలు మంజూరు చేయడంతో వైద్య విద్య అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. తద్వారా ఈ ప్రాంత విద్యార్థులు దూరం వెళ్లాల్సిన ఇక్కట్లు తీరాయని చెప్పారు. ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలో విద్యార్థులందరికీ ఉన్నత విద్య అందించాలనేదే తన లక్ష్యమని తెలిపారు. గతంలో వనరులు లేక చదువుకునే పరిస్థితి దూరమయ్యేదని.. ఇప్పుడు కేసీఆర్ ముందు చూపుతో ఆ కష్టాలు తీరాయని చెప్పారు. అనంతరం ఎంపీ నామా నాగేశ్వరరావు, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడగా కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, జెడ్పీ, డీసీసీబీ, విత్తనాభివృద్ధి సంస్థల చైర్మన్లు లింగాల కమల్‌రాజ్, కూరాకుల నాగభూషణం, కొండబాల కోటేశ్వరరావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి, ఎంపీపీ బెల్లం ఉమ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి సీపీఐ వినతి..

ఖమ్మంరూరల్: 90వేలకు పైగా జనాభా కల్గిన ఉన్న ఖమ్మంరూరల్ మండలంలో ఇప్పుడున్న పీహెచ్‌సీ ఒక్కటే ప్రజలకు వైద్య సేవలు అందించలేకపోతుందని, ఏదులాపురం కేంద్రంగా మరో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని మంత్రి హరీశ్‌రావుకు సీపీఐ నాయకుడు దండి సురేష్ వినతిపత్రం అందజేశారు. అదే విధంగా పెదతండా, ఏదులాపురం, పోలేపల్లి, వెంకటగిరి, గుర్రాలపాడు గ్రామపంచాయతీలకు అదనపు సబ్ సెంటర్లు మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, వెంపటి సురేందర్ తదితరులు ఉన్నారు.

వాహనాల బిల్లులు ఇప్పించండి..

ఖమ్మంక్రైం: ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అద్దె వాహన యజమానులు గురువారం మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందించారు. అద్దె వాహనాల యజమానులకు 20 నెలలుగా బిల్లులు రాకపోవడంతో కుటుంబ పోషణతో పాటు వాహన ఫైనాన్సులు చెల్లించడం ఇబ్బందిగా ఉందన్నారు.

మమత రజతోత్సవ వేడుకకు తరలిన టీఎన్జీవోస్..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మమత వైద్య కళాశాల రజతోత్సవంలో పాల్గొనేందుకు టీఎన్జీవోస్ బాధ్యులు భారీగా తరలినట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ తెలిపారు. గురువారం టీఎన్జీవోస్ కార్యాలయం నుంచి మెడికల్ కళాశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ సాగర్, నందగిరి శ్రీను, న్యూహౌస్ బిల్డింగ్ సొసైటీ చీఫ్ ప్రమోటర్ చంద్రశేఖర్, నాయకులు చుంచు వీర నారాయణ, పవన్, నాగుల్ మీరా,సాయి శిరిణ్మయి ,వెంకటరెడ్డి ,శివస్వప్న తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టీఎన్జీవోస్ బాధ్యులు

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

నేలకొండపల్లి: పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.జమలారెడ్డి సూచించారు. మండలంలోని మంగాపురంతండాలో పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించి బూత్ లెవల్ అధికారులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద వికలాంగులు వచ్చిపోయే విధంగా ర్యాంపు ఏర్పాటు చేయాలని, విద్యుత్, తాగునీటి సౌకర్యం వంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు కోసం ఈ నెల 19 వరకు అవకాశం ఉన్నందున యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, బూత్ లెవల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అరెస్టులను ఖండిస్తూ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలో మంత్రుల పర్యటన నేపథ్యాన వామపక్ష విద్యార్థి సంఘాల నేతలను ముందస్తు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యాన గురువారం నగరంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకురాలు దీపికా, ఖమ్మం నగర కార్యదర్శి కరుణ్‌లు మాట్లాడుతూ.. జిల్లాకు జనరల్ యూనివర్శిటీ, వైద్య కళాశాల ఏర్పాటు కోసం కొట్లాడిన విద్యార్థి సంఘ నాయకులను అరెస్టు చేసి, నిర్బంధించి వైద్య కళాశాలను ప్రారంభించుకోవడం ఏంటని ప్రశ్నించారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.క్రాంతి, వామపక్ష విద్యార్థి సంఘాల నేతల అరెస్టులను ఖండించారు.

బీజేపీ ఆధ్వర్యాన..

ఖమ్మం మామిళ్లగూడెం: నిరుద్యోగులకు అండగా ఉపవాస దీక్ష చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా గురువారం బీజేపీ కార్యాలయం ఎదుట ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య యాదవ్ ఆధ్వర్యాన ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ శీలం పాపారావు, ఆయుష్మాన్ భారత్ జిల్లా కన్వీనర్ పసుమర్తి సతీష్, జిల్లా ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, దొడ్డా అరుణ, అనిత, పి.వెంకట్, తాజ్‌నోత్ భద్రం పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

ఖమ్మం అర్బన్: అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని డివిజన్ ఇన్‌చార్జ్‌లకు కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్ సూచించారు. గురువారం నగరంలోని పలు డివిజన్లలో విస్తృతంగా పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటు హక్కుతో సరైన నాయకున్ని ఎన్నుకునే విధంగా ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. అదే విధంగా ఈ నెల 17న హైదరాబాద్‌లోని తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో నిర్వహించనున్న విజయ భేరి సభకు భారీగా జన సమీకరణ చేయాలన్నారు. అనంతరం కాంగ్రెస్ డిక్లరేషన్‌ను, గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెం గురుకుల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న స్ప్రింగ్ లీఫ్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ పి.రవిమారుత్ తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

గురుకుల విద్యార్థినులకు ర్యాంకులు

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లిలో గల గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు పోస్ట్ పీజీలో సెంట్రల్ యూనివర్శిటీలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. జి.శ్రావణి, ఎంఎస్సీ, మ్యాథమేటిక్స్ విభాగంలో రాయ్‌పూరల్‌లో సీటు సాధించింది. కె.సౌమ్య, ఉమశ్రీ, డి.స్వాతి, శ్రావణి, ఎస్‌కె.త్రీష్మాలు సెంట్రల్ యూనివర్శిటీల్లో ర్యాంక్‌లు పొందారు. వీరితో సీపీ జెట్‌లో కూడా 150 మంది విద్యార్థినులు మంచి ర్యాంక్‌లు సాధించారని ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్‌లతో పాటు వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, సీజీసీ కోఆర్డినేటర్ డాక్టర్ అమీనా ఖాతూన్‌లు అభినందించారు.

వారోత్సవాలను జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్/ తిరుమలాయపాలెం: ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో రేపు(శనివారం)సాయంత్రం జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి శ్రీను పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మం నగరంలో బోడేపుడి వెంకటేశ్వరరావు, వట్టికొండ కాంతయ్య, ముత్యాలు, యర్రా అప్పారావుల స్మారక స్తూపాలకు సీపీఎం నాయకులు నివాళులర్పించిన సందర్భంగా నున్నా, తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన జనరల్ బాడీ సమావేశాల్లో శ్రీను మాట్లాడారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా 16న సాయంత్రం 5గంటలకు నిర్వహించే సభకు కార్యకర్తలు ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలతో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మండల నాయకులు తుల్లూరి నాగేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, యర్రా శ్రీనివాస్, నాగటి సురేష్, సైదులు, ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా పాపారావు



శీలం పాపారావు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఖమ్మంకు చెందిన ప్రముఖ వైద్యుడు శీలం పాపారావు నియమితులయ్యారు. గురువారం ఈమేరకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ.. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పోషణ మాసోత్సవం

ఖమ్మంగాంధీచౌక్/నేలకొండపల్లి: పౌష్టికాహార లోపాన్ని నివారించాలనే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. గురువారం ఖమ్మం నగరంలోని ముస్తఫానగర్ సెక్టారు శ్రీనివాసనగర్ బొస్తకాలనీ(17వ డివిజన్)లో, నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు పోషకాహార విలువల గురించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో 17వ డివిజన్ కార్పొరేటర్ ధనాల రాధ, ఖమ్మం అర్బన్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్.పుష్పలత, నాగమణి, జిల్లా పోషణ అభియాన్ కో–ఆర్డినేటర్ పానుగొటి సంపత్, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రాసన చేస్తున్న కార్పొరేటర్ ధనాల రాధ

రైతులకు మేలు కలిగేలా పనిచేయాలి

కూసుమంచి: రైతులకు అధునాతన, సాంకేతిక పద్ధతుల ద్వారా సాగు సలహాలు అందిస్తూ.. ఆర్థికంగా వారు లాభపడేలా సీఆర్పీలు పనిచేయాలని కూసుమంచి ఏడీఏ విజయచంద్ర సూచించారు. డిజిటల్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యాన వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సీఆర్పీలతో గురువారం కూసుమంచిలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ గ్రీన్ సంస్థ రూపొందించిన విస్తార్ యాప్ గురించి ఆ సంస్థకు చెందిన అమిత్, అనుష్క ఈ సమావేశంలో పాల్గొని గ్రూప్ డిస్కర్షన్ ద్వారా వివిధ అంశాలపై సీఆర్పీలకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. కాగా, ఢిల్లీ నుంచి వచ్చిన డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు వివిధ శాఖల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, సర్ఫ్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిజిటల్ గ్రీన్ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ యశోద, కేవీకే శాస్త్రవేత్తలు రవి, సునీత, పశువైద్యాధికారులు నీలకాంత్, సంజయ్‌రెడ్డి, ఏఈఓలు ప్రియాంక, సౌమ్య, నిఖిల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్ సంఘీభావం

కామేపల్లి: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కొత్తలింగాల క్రాస్‌రోడ్డులో అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 4వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బానోత్ వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్, మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, నాయకులు దమ్మాలపాటి సత్యనారాయణ, నల్లమోతు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పుట్టినరోజు వేడుకలు..

మండల పరిధిలోని ముచ్చర్ల క్రాస్‌రోడ్డులో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్, మండల అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మాలపాటి సత్యనారాయణ, మద్దినేని రమేష్, ఎంపీటీసీ రాంరెడ్డి జగన్నాథరెడ్డి, సర్పంచ్ కిన్నెర నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

పోలీస్ స్టేషన్ వద్ద అంగన్‌వాడీల ఆందోళన

నేలకొండపల్లి: పాలేరులో రాష్ట్ర మంత్రుల పర్యటన సందర్భంగా ఎలాంటి ఆందోళనలు జరగకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.కోటేశ్వరిని పోలీసులు అరెస్ట్ చేయటంతో అంగన్‌వాడీ టీచర్లు స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీటు జిల్లా నాయకుడు పగిడికత్తుల నాగేశ్వరరావు, ఇతర నాయకులు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రాబోయేది ఇందిరమ్మ ప్రభుత్వమే..

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం: తెలంగాణలో కాంగ్రెస్ జెండా రెపరెపలాడడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు మువ్వా విజయబాబు నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని 23వ డివిజన్ ముస్తఫానగర్‌లో పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డితో కలిసి గడప గడపకూ కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాబోయే ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ ఒక్కరికి న్యాయం చేకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మలీదు జగన్, మియా భాయ్, ఇమామ్ భాయ్, దుంపల రవికుమార్, వాలూరి ఝాన్సీ, మందడపు తిరుమలరావు, బాణాల లక్ష్మణ్, చింతమళ్ల గురుమూర్తి, శ్రీకళా రెడ్డి, కాంపాటి వెంకన్న, ప్రతిభ, చల్లా రామకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అంతేకాక రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామంలో గురువారం సాయంత్రం మువ్వా విజయబాబు ఆధ్వర్యాన గడప గడపకూ కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు జగన్, సర్పంచ్ మందడపు తిరుమలరావు, రామ్మూర్తి, ఆరీఫ్, రాము, తుమ్మలపల్లి నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మువ్వా విజయబాబు

9 డైరెక్టర్ స్థానాలకు.. 31 మంది నామినేషన్లు..

నేలకొండపల్లి: ఈ నెల 22న జరగనున్న చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలకు సంబంధించి గురువారం నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఈ నెల 12 నుంచి 14 వరకు నామినేషన్లను ఎన్నికల అధికారి ప్రసాద్ స్వీకరించారు. మొత్తం 9 డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు జరగనుండగా.. 31 మంది దరఖాస్తు చేసుకున్నారు. జనరల్ కేటగిరి–24,ఎస్టీ కేటగిరి–3,మహిళ కేటగిరి–4 నామినేషన్లు వచ్చాయి. కాగా, ఈ నెల 15వ తేదీన స్క్రూట్నీ, 16న ఉపసంహరణ ఉన్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఓ పక్క సొసైటీని ఏకగ్రీవం చేసేందుకు కసరత్తు ప్రారంభించగా.. మరో పక్క ఎన్నికల ఫలితాల్లో తెల్చుకుంటామని పేర్కొంటున్నారు.

'ఎస్‌బీఐటీ'లో లింక్‌డ్ ఇన్ ట్రైనింగ్ ప్రోగ్రాం

ఖమ్మం సహకారనగర్: స్థానిక ఎస్‌బీఐటీ కళాశాలలో విద్యార్థులకు ఉపయోగపడే లింక్‌డ్ ఇన్ ట్రైనింగ్ ప్రోగ్రాంను గురువారం ప్రారంభించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు కెరీర్ మలుపు కోసం తీసుకోవాల్సిన విధి, విధానాలను తెసుసుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ఫేస్‌ప్రెప్ సంస్థ ప్రతినిధులు ఉషా సక్కుభాయి, భానుప్రియలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శ్రీనివాసరావు, శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్ వేడుకలు

నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో హిందీ దివస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు హిందీ భాషా ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న అధ్యాపకులు



సర్వజ్ఞలో నిర్వహించిన హిందీ భాషా దినోత్సవంలో డైరెక్టర్ ఆర్‌వీ నాగేంద్రకుమార్



శ్రీచైతన్య ఒలంపియాడ్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం



విద్యార్థినులతో రెజొనెన్స్‌శ్రీనగర్ డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి



ఎగ్జిబిషన్ ప్రదర్శన నిర్వహిస్తున్న అరవింద హైస్కూల్ విద్యార్థులు